పెన్షనర్స్ జిల్లా కార్యవర్గ సమావేశం రేపు

టెక్కలి: జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల రెండో తేదీన టెక్కలిలోని విశ్రాంత ఉద్యోగుల సమావేశం భవనంలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ఆర్.రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్లు అప్‌లోడ్‌కు సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తామన్నారు. ఉదయం పది గంటల నుంచి నిర్వహించనున్న సమావేశానికి సభ్యులంతా హాజరు కావాలని కోరారు.





సత్యసాయి సమితి సేవలు విస్తృతం


మాట్లాడుతున్న లింగరాజు

టెక్కలి: సత్యసాయి సేవా సమితి సామాజిక కార్యక్రమాలను ఈ ఏడాది మరింత విస్తృతం చేయాలని సమితి జిల్లా అధ్యక్షుడు లింగరాజు కోరారు. స్థానిక రోటరీనగర్‌లోని సత్యసాయి ప్రశాంతి మందిరంలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యనారాయణ, గ్రామ సేవలు మరింత విస్తృతం చేయాలన్నారు. దీనికి సంబంధించి ముందస్తు ప్రణాళిక రూపొందించారు. కార్యక్రమంలో బి.అన్నపూర్ణ, చంటి, జగదీశ్వరరావు ఉన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర


హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్న అధికారులు

వజ్రపుకొత్తూరు: పూడిజగన్నాథపురం, పల్లివూరు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 17 సంక్షేమ పథకాలను ప్రజలు అందిస్తున్నారన్నారు. వాటిని పొందేందుకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు ఆయుష్మాన్ భవ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు గుంటు ధనరాజు, ఈటీపీఆర్ డి.తిరుమలరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు జి.రామారావు, ఏపీఎం కె.జాంభవతి, ఏపీవో కేశవరావు పాల్గొన్నారు.























నూతన వేడుకలకు సిద్ధం



కంచిలి: అమ్మకానికి సిద్ధంగా కేకులు

కంచిలి: నూతన సంవత్సర వేడుకలకు సర్వం సిద్ధం అయ్యింది. మండల కేంద్రం కంచిలితోపాటు వివిధ కూడళ్లలో నూతన సంవత్సర స్వాగత కేక్‌లను అమ్మకానికి సిద్ధం చేశారు. వీటితోపాటు స్వీట్స్, గ్రీటింగ్ కార్డ్స్, పూల బొకేలు అమ్మకాలకు పెద్ద ఎత్తున సిద్ధమయ్యాయి. వీటి కోసం కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి ఉదారత

మందస: మందస పట్టణానికి చెందిన శానాపతి కిశోర్‌కుమార్ ఉదారత చూపారు. ఈ ప్రాంత ఆరాధ్య దైవం కంచమయమ్మ తల్లి ఆలయ నిర్మాణం రాజుల కాలంలో జరిగింది. పట్టణ శివార్లోని ఆలయం పక్కనే ఇటీవల ఓ పూజారి ఆత్మహత్య చేసుకున్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న ఆలయానికి భక్తుల రాకపోకలు తగ్గాయి. దీంతో వెదురుపొదలు, పిచ్చిమొక్కలు, ముళ్లడొంకలు ఆలయానికి వెళ్లేదారిలో పెరిగి పాదచారులు కూడా నడవలేని స్థితికి చేరింది. పరిస్థితి చూసిన పార్టీ యువజన కార్యదర్శి కిశోర్‌కుమార్ రహదారిని బాగు చేయించారు. పాందరవీధి యువకులు సహాయ, సహకారాలు తీసుకుని.. ఆలయానికి వెళ్లేదారిలో ముళ్లపొదలు తొలగించారు. మరో రెండు రోజుల్లో గ్రావెల్‌తో రోడ్డు నిర్మించి పూర్తిస్థాయిలో భక్తులకు రహదారి సౌకర్యం కల్పిస్తామని ఆయన చెప్పారు.



రోడ్డు బాగు చేసిన దృశ్యం

జీడి పరిశ్రమలతో అందరికీ మేలు

● పీసీఎంఏ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి అప్పలరాజు



జీడిపప్పు దండతో మంత్రి అప్పలరాజును సత్కరిస్తున్న పీసీఎంఏ ప్రతినిధులు

కాశీబుగ్గ: ప్రపంచ ప్రఖ్యాతగాంచిన పలాస జీడిపప్పుకు మరింత ప్రోత్సాహం అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించుకున్న వెంటనే 60 ఎకరాల్లో కొత్త పారిశ్రామిక వాడ మంజూరు చేసి ప్రారంభించారని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పీసీఎంఏ (పలాస కాష్యూ మాన్యుఫ్యాక్చర్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. పలాసలో ఉన్నటువంటి జీడి పరిశ్రమలు ఇప్పటికే 20 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నాయని చెప్పారు. మరింత ప్రోత్సహిస్తే అటు రైతులు, కార్మికులు, మధ్యవర్తులు, ట్రేడర్స్, పర్చేజర్స్, ట్రావెలర్స్, ఎక్స్‌పోర్టర్స్ ఇలా అనేక మంది ఆధారపడి ఉన్నారని.. పరోక్షంగా మన ప్రాంతం ఇంకాస్త ముందుకు వెళ్తోందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఎటువంటి పన్నులు, కమీషన్ల వసూళ్లు చేసే పరిస్థితులు లేవన్నారు. అటు నాయకులు, ఇటు అధికారులు, ఇతర ఏ శక్తుల నుంచి జీడి వ్యాపారులకు ఇబ్బందులు లేకపోవడంతో మార్కెట్ పెరిగిందని వివరించారు. దానికి తోడు జంట పట్టణ రోడ్లను 80 అడుగులు విస్తరణ పనులు చేయడంతో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ రూపురేఖలు మారిపోయావన్నారు. అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి జగన్ రూ.5 కోట్లు నిధులు విడుదల చేశారన్నారు. అలాగే నూతన పారిశ్రామిక వాడకు రూ.11 కోట్లు విడుదలయ్యాయని పేర్కొన్నారు. మంత్రిగా అందరికీ మేలు చేశానుతప్పితే ఎవ్వరికీ అన్యాయం చేయలేదన్నారు. తన పనితనం, ముఖ్యమంత్రి ఆశీస్సులతో తనను మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా తప్పు చేస్తే చూపించాలన్నారు. నాలుగున్నరేళ్లగా పలాస నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని గమనించాలన్నారు. ఈ సందర్భంగా మంత్రిని పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా సురేష్‌బాబు, మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, ఏఎంసీ చైర్మన్ పి.వి.సతీష్ సత్కరించారు. కార్యక్రమంలో పీసీఎంఏ కార్యదర్శి, కోశాధికారులు రవికాంత్, శివక్రిష్ణ, గౌరవ అధ్యక్షుడు బెల్లాల సత్యంనారాయణ, మల్లా కృష్ణారావు, శాశనపురి మురళీకృష్ణ, అనంతగిరి పంచాయతీ సర్పంచ్ కాటకాన మల్లేశ్వరరావు ఉన్నారు.

































అయోధ్య రాముని అక్షింతలు ఊరేగింపు



అక్షింతలను స్పృశిస్తున్న భక్తులు

కంచిలి: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను స్పృశించే కార్యక్రమం మండల కేంద్రం కంచిలిలో ఆదివారం ఘనంగా జరిగింది. బలియాపుట్టుగ కాలనీలోని హనుమాన్ ఆలయం నుంచి భక్తులు ఊరేగింపుగా రాధాకృష్ణ ఆలయం వరకు అక్షింతలను తీసుకొచ్చారు. రాధాకృష్ణ ఆలయంలోఅక్షింతలను స్పృశించే కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీరామ నామం జపిస్తూ ఈ ప్రక్రియను చేపట్టారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



చంద్రశేఖర్ (ఫైల్)

ఇచ్ఛాపురం: పట్టణంలోని గొల్లవీధికి చెందిన విద్యార్థి దక్కత చంద్రశేఖర్ (14) గత కొన్ని రోజులుగా రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. చంద్రశేఖర్ ఈ నెల 26న మందస మండలంలో గల సిగలపుట్టగ సముద్ర తీరానికి పిక్నిక్ చేసుకోవడానికి ట్యూషన్ విద్యార్థులతో పాటు వచ్చాడు. తీరంలో అలల తాకిడికి అతనితో పాటు మేఘన, ఆశి జయరాం గల్లంతయ్యారు. వీరిలో జయరాం మృతి చెందగా చంద్రశేఖర్, మేఘన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అప్పటి నుంచి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న చంద్రశేఖర్ ఆదివారం మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

నీలమ్మ మృతికి సంతాపం



నీలమ్మ (ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: బాతుపురం పంచాయతీ పెదవంక గ్రామానికి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు చెల్లూరి నారాయణరావు తల్లి నీలమ్మ (76) ఆదివారం మృతి చెందారు. నారాయణరావు కొన్నేళ్లుగా అజ్ఞాతవాసంలో ఉంటున్నారు. నీలమ్మ మృతదేహంపై అరుణ పతాకాన్ని కప్పి పలువురు నివాళులర్పించారు. ఆమె మృతికి సంతాపం తెలియజేశారు. మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకొని విప్లవ జోహర్లు నడుమ అంత్యక్రియలు పూర్తి చేశారు.

జాతీయస్థాయి క్రీడాకారుడికి సాయం



సాయాన్ని అందజేస్తున్న జయప్రకాశ్‌రెడ్డి

ఇచ్ఛాపురం: ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన గోవింద్‌బెహర ఢిల్లీలో జనవరి మూడో తేదీ నుంచి జరగనున్న ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఆదివారం పయనమయ్యారు. ఈయనకు ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ రీజనల్ కోఆర్డినేటర్ దక్కత జయప్రకాశ్‌రెడ్డి ఆర్థిక సాయాన్ని అందించారు. జాతీయస్థాయి పోటీల్లో విజేతగా తిరిగిరావాలని ఆకాంక్షించారు. వార్డు కౌన్సిలర్ పరపటి మంజులతారెడ్డి, కోటి, స్విమ్మింగ్ కోచ్ బత్తుల రామారావు ఉన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి



మాట్లాడుతున్న మోహనరావు

సోంపేట: అంబేడ్కర్ చూపిన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని జైభీమ్ సేన జిల్లా అధ్యక్షుడు నగిరి మోహనరావు పిలుపునిచ్చారు. జైభీమ్‌సేన ప్రథమ వార్షికోత్సవాన్ని సోంపేట పట్టణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. వెనుకబడిన తరగతుల అభివృద్ధికి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కృషి చేశారన్నారు. రాజ్యాంగంలో ఆయన కల్పించిన హక్కులను వెనుకబడిన తరగతుల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జైభీమ్‌సేన సమాజ సేవతో పాటు, వెనుకబడిన తరగతుల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎస్.జొరాడు, ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎన్.ఎ.డి.పాల్, ప్రధాన కార్యదర్శి డొప్ప వెంకటరావు, అసోసియేట్ అధ్యక్షుడు గొలియా ప్రకాశరావు, విశాఖపట్నం అధ్యక్షుడు మామిడి రవిసిద్దార్థ, కంచిలి శాఖ అధ్యక్షుడు ఇప్పిలి ధర్మారావు, సామాజిక ఆస్పత్రి వైద్యుడు పెద్దింటి దుర్యోధన, జైభీమ్‌సేన సంఘ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే ఒరియా మైనారిటీల అభ్యున్నతి

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యన్నారాయణ పాఢి



మాట్లాడుతున్న సత్యన్నారాయణపాఢి

కవిటి: జిల్లాలోని ఒరియా మైనారిటీల అభ్యున్నతికి మనందరి ఐక్యతే ఆయుధమనే నగ్నసత్యాన్ని గుర్తించి మసలుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యన్నారాయణ పాఢి అన్నారు. వింధ్యగిరి కుతారిచండీ అమ్మవారి ఆలయప్రాంగణంలో ఒరియా మైనారిటీ కులస్తుల ఆత్మీయ సమావేశం, వనభోజనం కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి బరంపురం ఎంపీ చంద్రశేఖర్‌సాహూ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఒరియా మైనారిటీ కులాలకు చెందిన ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అత్యధిక స్థాయిలో అందుకునేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఒరియా మైనారిటీ కులాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవరాజ్‌సాహూ, పంచానన్‌రౌళో, కుమార్‌నాయక్ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



దామోదరరావు మృతికి సంతాపం తెలియజేస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

టెక్కలి: మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని సీనియర్ జర్నలిస్టు, డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు సూచించారు. టెక్కలి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కె.సుదర్శనరావు ఆధ్వర్యంలో ఆదివారం టెక్కలి సమీపంలో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం లావేరు సాక్షి విలేకరి దామోదరరావు మృతికి ప్రెస్‌క్లబ్ సభ్యులంతా సంతాపం వ్యక్తం చేశారు. సీనియర్ పాత్రికేయుడు కోత మధు, ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు బి.వాసు, ఉపాధ్యక్షుడు ఎస్.గోపినాథ్, పి.వినాయకరావు, కార్యదర్శి ఎం.పద్మలోచన, సభ్యులు జి.శ్రీనివాస్, వి.కీర్తి, కె.శంకర్‌రెడ్డి, జి.కృష్ణారావు, కె.సోమేష్, కె.రాము, రామరాజు పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై అవగాహన



అపరాల్లో జీవామృతం వాడకాన్ని వివరిస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: జీవనద్రవ్యంతో కూడిన భూసారాన్ని పరిరక్షించుకోవడం ప్రతి రైతు కర్తవ్యమని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి మద్దిలి చిట్టిబాబు అన్నారు. ఆదివారం పాయితారిలో జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. జీవామృతం సేంద్రియ, ఇది రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయమన్నారు. వీటి వాడకం వలన భూమిలో వానపాములు చైతన్యవంతమై అన్ని రకాల పోషకాలను పంటలకు అందించేందుకు నిరంతరం శ్రమిస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్టీ కందాల కుమారి, వీవో గణికొట్టి మన్మథరావు, వి.బాబూరావు, బొరిగి ఇందిరాలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి సాయం



భారతికి సాయాన్ని అందజేస్తున్న గ్రీన్ సభ్యులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ జగనన్న కాలనీలోకి చెందిన సతివాడ భారతి ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయింది. బాధిత కుటుంబ సభ్యులను గ్రీన్‌ఆర్మీ అసోసియేషన్ సభ్యులు ఆదివారం పరామర్శించారు. నిత్యావసర సరుకులు, ఆర్థికసాయాన్ని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్ల కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ రోణంకి శాంతికుమారి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, బత్తిని ఓంకారం, కిశోర్ పాత్రో, నీలాపు ఉపేంద్రరెడ్డి, దాసరి వైకుంఠరావు, రోణంకి శ్రీనివాసరావు ఉన్నారు.

ఏనుగమ్మ ఏనుగు!

ఇచ్ఛాపురం రూరల్:

లారీపై ఏనుగు మృతదేహాలను తరలిస్తున్నారని పట్టణంలో పుకార్లు వచ్చాయి. దీంతో వాటిని చూసేందుకు జనం పరుగులు తీశారు. తీరా లారీ వద్దకు వెళ్లి చూసేసరికి అవి బొమ్మలు కావడంతో నవ్వుకుంటూ వెనుదిరిగారు. ఆదివారం స్థానిక 16వ నంబర్ జాతీయ రహదారిపై రెండు లారీల్లో పెద్ద ఏనుగు బొమ్మలను తరలిస్తున్నారు. అయితే ఇవి నిజమైన ఏనుగుల మృతదేహాలు అనుకొని బలరాంపురం నుంచి పాతచెక్ పోస్టు వరకు జనం పరుగులు తీశారు. తీరా ఫైబర్‌తో తయారు చేసిన బొమ్మలుగా నిర్ధారించుకొని వెనక్కి వచ్చేశారు. కోల్‌కత్తాలో జరగనున్న ఓ ఉత్సవంలో ప్రదర్శన కోసం వీటిని విజయనగరం నుంచి తీసుకొని వెళ్తున్నట్టు లారీ డ్రైవర్లు తెలిపారు.



లారీలపై తరలిస్తున్న ఏనుగు బొమ్మలు

క్లుప్తంగా

జోరుగా కేక్‌ల విక్రయం



కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో కేక్‌లను విక్రయిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: ఆంగ్ల నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో సందడి వాతావరణం ఆదివారం కనిపించింది. కాశీబుగ్గ నుంచి పలాస వరకు ఉన్నటువంటి స్వీట్ దుకాణాల వద్ద న్యూయర్ కేక్‌ల విక్రయాలు జోరుగా సాగాయి. కొంతమంది యువకులు భారీ కేక్‌లను ఆర్డర్‌గా ఇచ్చారు. పట్టణంలో సాయంత్రం నుంచే యువకులు సందడి చేశారు.

పండిత పరిషత్ క్యాలెండర్ ఆవిష్కరణ



ఆర్‌యూపీపీ సంఘ ప్రతినిధులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రామ్మోహనరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు కోరారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) సంఘం 2024 సంవత్సర క్యాలెండర్‌ను తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను విద్యార్థులకు చేరవేయడంలో ఉపాధ్యాయులు కీలక బాధ్యత వహిస్తుండటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండేపల్లి మల్లేసు, మహిళా కార్యదర్శి కనుమెట్ట పద్మావతి, ఎస్.వీరాస్వామి, టి.మురళీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, వి.రమణమూర్తి, రమణయ్య, సూర్యారావు, అరుణ, కాంచన, రాజ్యలక్ష్మి, పాల్గొన్నారు.

సాక్షి విలేకరి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



దామోదర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: లావేరు మండల సాక్షి విలేకరి గిరిజా దామోదర్ కుటుంబాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. లావేటిపాలెంలోని దామోదర్ ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దామోదర్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. దామోదర్ పరిస్థితి తెలిసి చాలా బాధపడ్డానని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం దామోదరరావు భార్య మాట్లాడుతూ.. నా భర్తకు సమాజంలో ఎలాంటి గౌరవం ఉందో, అదే గౌరవం తమ కుటుంబంపై కూడా ఉంచాలని ఎమ్మెల్యేను కోరారు. దామోదర్ సోదరులు శ్రీనివాసరావు, కోటేశ్వరరావుకు ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. పిల్లలు సుమంత్, వర్షిణిని చక్కగా చదివించాలని, అందుకు తగిన తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జ్ మీసాల శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, లావేరు వైస్ సర్పంచ్ పైడి దామోదరరావు ఉన్నారు.

విజయగణపతికి ప్రత్యేక అలంకరణ



అలంకరణలో విజయగణపతి ఆలయం

శ్రీకాకుళం కల్చరల్: నూతన సంవత్సరం సందర్భంగా పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయాన్ని పూలు, విద్యుత్ బల్బులతో అలంకరించారు. స్వామిని కూడా ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు నగేష్‌శర్మ, శ్రీధర్ శర్మల ఆధ్వర్యంలో భక్తులకు అర్ధ రాత్రి ఒంటి గంట వరకు దర్శనాలకు ఏర్పాటు చేశారు.

నాలుగు పశువుల లారీల సీజ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఒడిశా వైపు అక్రమంగా తరలిస్తున్న నాలుగు పశువుల లారీలను ఎచ్చెర్ల పోలీసులు సీజ్ చేశారు. శనివారం అర్ధ రాత్రి సమయంలో ఎస్సై వి.సత్యనారాణ, పోలీస్ సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. నాలుగు లారీల్లో 21 ఎద్దులు, 12 గేదెలు ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. పశువులను గోశాలలకు తరలించారు. వీటిని కబేళాలకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘాపెట్టినట్లు ఎస్సై తెలిపారు.

వాణిజ్య కేంద్రంగా బ్రాహ్మణతర్లా

● మంత్రి సీదిరి అప్పలరాజు



పింఛను మంజూరు పత్రాలను అందజేస్తున్న మంత్రి అప్పలరాజు

పలాస: బ్రాహ్మణతర్లా గ్రామం గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయిందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో వాణిజ్య కేంద్రంగా బ్రాహ్మణతర్లా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు, గ్రామాల అభివృద్ధే ప్రధాన కారణమని చెప్పారు. పింఛన్ల పెంపు మంజూరు పత్రాలను లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఈ గ్రామంలో అన్ని రకాల పింఛన్లు 366 ఉండేవని, ఇప్పుడు వాటి సంఖ్య 697కి పెరిగిందన్నారు. గత ఎన్నికలకు కొద్ది రోజులు ముందు పింఛన్ మొత్తాన్ని చంద్రబాబు వెయ్యి రూపాయలు చేశారని.. వైఎస్సార్‌సీపీ సర్కార్ హయాంలో మూడు వేల రూపాయలకు పెంచామన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్‌కు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బ్రాహ్మణతర్లా రూ.కోటి 90 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గ్రామంలోని అంతర్గత రోడ్లకు రూ.60 లక్షలు, నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధికి రూ. 70 లక్షలు, మంచినీటి సుదపాయం కోసం రూ. 60 లక్షలు ఖర్చు చేశామన్నారు. ఇవి కాకుండా కోట్లాది రూపాయలను సంక్షేమ పథకాలుగా ప్రజలకు అందజేశామన్నరు. ప్రతిపక్షంలో ఉన్నవారు ఏమి అభివృద్ధి చేశారని అంటున్నారని.. అటువంటివారికి బ్రాహ్మణ తర్లా ప్రజలు తగిన జవాబు చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పలాస పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టిబాబు, ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు, ఎంపీపీ ఉంగ ప్రవీణ, ఉంగ సాయిక్రిష్ణ, మచ్చ ధనరాజు, దువ్వాడ రవి, కొర్ల సంతోష్, సర్పంచి బాడాన పుష్ప, ఎంపీటీసీ సభ్యురాలు రవణమ్మ, దంతం వైకుంతరావు, చింతాడ మాధవరావు, పంచాయతీ కార్యదర్శి రేఖ పాల్గొన్నారు.

సాగర తీరంలో సం(డే)దడి



వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

వజ్రపుకొత్తూరు రూరల్/ఇచ్ఛాపురం రూరల్: వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి శివసాగర్ బీచ్, ఇచ్ఛాపురం సమీపం ఒడిశాలోని స్వర్ణాపురం సాగర తీరం ఆదివారం జనంతో సందడిగా మారింది. జిల్లాతోపాటు ఒడిశా సమీప గ్రామాల పర్యాకులు తీర ప్రాంతాలకు వచ్చి ఆనందంగా గడిపారు. తీరం పరిసర తోటల్లో సహపక్తి భోజనాలు చేసి తీరంలో ఆటపాటలతో ఆనందంగా గడిపారు. సముద్ర స్నానాలు చేసి కేరింతలు కొటాటరు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక, మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ఇచ్ఛాపురం రూరల్: స్వర్ణాపురం బీచ్‌లో పర్యాటకుల సందడి



ఇచ్ఛాపురం రూరల్: సాగర తీరానికి తరలివస్తున్న పర్యాటకులు

పలాసలో 'క్యాజు'వల్ కానుక



మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు జీడిపప్పుతో చేసిన మెమెంటో ఇస్తున్న జీడి వ్యాపారులు (ఫైల్)



ధర్మాన కృష్ణదాస్‌కు అందిస్తున్న జీడి బహుమతి (ఫైల్)



ఉపరాష్ట్ర ప్రతి వెంకయ్యనాయుడుకు బహుమతి అందిస్తున్న జీడిపరిశ్రమదారుల సంఘాలు (ఫైల్)

కాశీబుగ్గ: పూలబొకేల సంప్రదాయం పాతదైపోయింది. పూల దండలూ పురాతనమైపోయాయి. ఇప్పుడంతా జీడి బహుమతులదే ట్రెండ్. శుభాకాంక్షలు చెప్పడానికి, అభినందనలు తెలపడానికి, స్వాగతం పలకడానికి సృజనకు రుచి జోడించి తయారుచేసిన ఈ జీడి దండలు ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. నూతన ఏడాది సందర్భంగా వీటికి గిరాకీ పెరిగింది. జిల్లాలో అత్యధికంగా జీడి పరిశ్రమలు ఉన్న పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఈ ట్రెండ్ మొదలుపెట్టారు. జీడిగుడ్డు, జీడి బద్దలతో తయారు చేసిన బొకేలు, దండలు, గిఫ్ట్ బాక్సులు, టోపీలు, తోరణాలను శుభాకాంక్షలు చెప్పడానికి వినియోగిస్తున్నారు. పలాసకు జీడిపారిశ్రామిక వాడ ఏర్పాటు చేసి, టాక్సులు తగ్గించిన వైఎస్ రాజశేఖర రెడ్డి పలాస వచ్చినప్పుడు జీడి పప్పు దండలు, బుట్టలు అందజేశారు. సీఎం వైఎస్ జగన్ వచ్చినప్పుడు కూడా జీడిపప్పు బొకెలతో స్వాగతం పలికారు. ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు కూడా వీటిని కానుగా అందజేశారు. పలాస క్యాజూ మానుఫాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లా సురేష్ కుమార్ మాట్లాడుతూ ముఖ్య అతిథులకు తగ్గట్టుగా, ఆయా రంగాలకు తగినట్టుగా జీడి వస్తువులు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

క్రికెట్ జట్టు ఎంపిక పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 7 నుంచి 16 తేదీ వరకు తమిళనాడులోని చెన్నైలో హిందుస్థాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ విద్యాసంస్థలో సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయం క్రికెట్ పోటీలు జరగనున్నాయి. విజయజగరం జేఎన్‌టీయూ ఏఫిలియేషన్ కళాశాలల తరఫున హాజరయ్యే జట్టు ఎంపికను చిలకపాలెంలోని శ్రీశివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శని, ఆదివారాల్లో ఎంపికలు నిర్వహించారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలోని 16 కళాశాలల నుంచి 71 మంది క్రీడాకారులు పాల్గొనగా శనివారం 30 మందిని ఎంపిక చేశారు. ఆదివారం వీరిలో ఉత్తమ ప్రతిభ ఆధారంగా 15 మందిని తుది జట్టుకు ఎంపిక చేశారు. వీరు ఈ టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూ విజయనగరం తరఫున హాజరుకానున్నారు. సెలక్టర్లు డాక్టర్ పీఎస్‌వీ రమణ, ఎస్.లక్ష్మణమూర్తి, కమిటీ సభ్యులు ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహించారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి



శిష్టకరణ కుల పిక్నిక్‌లో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శిష్టకరణాల అభ్యున్నతికి తమమంతు కృషి చేస్తున్నట్టు చెప్పారు. నగరంలోని శ్రీచైతన్య ఈ–టెక్నో స్కూల్ గ్రౌండ్ (మహాలక్ష్మీనగర్)లో ఆదివారం ఏర్పాటు చేసిన శిష్టకరణ సంఘ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిష్ట కరణాలను బీసీల్లో చేర్చేందుకు తానెంతో కృషి చేశానని గుర్తు చేశారు. ఓ కులం అభివృద్ధి చెందేందుకు సంఘ నాయకులతోపాటు ప్రతినిధులు ముందుకు రావాలన్నారు. అనంతరం మంత్రి ధర్మానను సంఘ ప్రతినిధులు సత్కరించారు. అలాగే కలెక్టర్ ఆఫీస్ (గెంజి వారి తోట)లో సొండి కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో కూడా మంత్రి పాల్గొన్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, శిష్టకరణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, బలివాడ మల్లేశ్వరరావు, సదాశివుని కృష్ణ, డబ్బీరు వాసుదేవరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ఎల్.రమేష్, సొండి కులస్తులు నాయుకులు షావుకాని నాగేశ్వరరావు, ఆర్.వి.ప్రసాద్, రేవతి ఉన్నారు.

బహుమతుల ప్రదానం

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రామంలో సమీప గ్రామాల పాఠశాల విద్యార్థులకు ఆదివారం విజయనగరం జిల్లాకు చెందిన సుపథ స్వచ్ఛంద సంస్థ సేవా సంస్థ పలు అంశాల్లో పోటీలను నిర్వహించింది. వ్యాస రచిన, పద్య పఠనం, శ్లోకాల పఠనం, దేశ భక్తి గేయాలు పాడటం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన వమరివల్లి డైట్ ప్రిన్సిపాల్ తిరుమల చైతన్య మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం వల్ల విజ్ఞానం వృద్ధి చెందుతుందన్నారు. డైట్ వైస్ ప్రిన్సిపాల్ భారతి, సుపథ ప్రతినిధులు హరిశర్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజల గొంతుకగా ఉంటా..

● రోడ్డు ప్రారంభంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



తుమ్మావీధిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజల తరపున గొంతు వినిపించేందుకు ఎప్పుడూ ముందుంటానని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. న్యూకాలనీలో రూ.1.58 కోట్లతో నిర్మించిన బి.టి.రోడ్డును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజాపతినిధిగా ఉంటూ ప్రజల గొంతు వినిపించేందుకు ఎప్పుడూ ముందు ఉంటానని స్పష్టం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మిగిలిన పనులకు సంబంధించి టెండర్లు త్వరలో పిలుస్తున్నామని చెప్పారు. వాటిని త్వరలో పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో సర్క్యులేషన్ ప్యాట్రన్ అమల్లో ఉన్న ఏకై క కార్పొరేషన్ మనదేనని చెప్పారు. నగరాన్ని అందంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేస్తున్నట్టు పేర్కొన్నారు. 20 ఏళ్ల క్రితం పట్టణానికి సంబంధించి ఏర్పాటు చేసిన గార్బేజీ యార్డు నిండుకుందని దీంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఆ సమస్యకు చెక్ చెప్పేందుకు రూ.19 కోట్లతో చెత్తను తొలగించే పనులు జరుగుతున్నాయన్నారు. అనంతరం పుప్పాలవారి వీధిలో 15.6 లక్షలతో, తుమ్మావీధిలో రూ.9.50 లక్షలతో, దండివీధిలో రూ. 16.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, ఎం.వి. పద్మావతి, గొండు కృష్ణమూర్తి, సాధు వైకుంతరావు, చల్ల శ్రీను, వినయభూషణ్, అంబటి శ్రీను, చల్ల అలివేలుమంగ, మండవల్లి రవి, ఊన్న నాగరాజు, పైడి మహేశ్వరరావు, కోణార్క్ శ్రీను, అంధవరపు రమేష్ ఉన్నారు.

కడుపునిండా 'గోరుముద్ద'



టెక్కలి బాలికోన్నత పాఠశాలలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

● రుచికరంగా మధ్యాహ్న భోజనాలు
● ఆనందంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

గత టీడీపీ ప్రభుత్వం వరకు మెనూ ఇలా..	
సోమవారం	అన్నం, సాంబారు,
మంగళవారం	అన్నం, చారు, గుడ్డు కూర
బుధవారం	అన్నం, చారు, బంగాళదుంప కూర
గురువారం	అన్నం, చారు, గుడ్డు కూర
శుక్రవారం	అన్నం, చారు, గుడ్డు కూర
శనివారం	అన్నం, సాంబారు, సాధారణ కూర

టెక్కలి మండలంలో గోరుముద్ద అమలు ఇలా..	
మండలం	టెక్కలి
ప్రాథమిక పాఠశాలలు	69
ప్రాథమికోన్నత పాఠశాలలు	07
ఉన్నత పాఠశాలలు	09
ప్లస్ -2	01
మొత్తం విద్యార్థులు	5571
మొత్తం ఏజన్సీలు	86

టెక్కలి: జగనన్న గోరుముద్ద.. ఈ పథకం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, సామాన్య విద్యార్థులకు కడుపునిండా భోజనం పెడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, సామాన్య వర్గాలకు చెందిన విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఎదిగి చక్కటి విద్యనభ్యసించాలంటే వారికి సరైన భోజనం అందజేయాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్తగా రూపకల్పన చేసిన 'జగనన్న గోరుముద్ద' పథకంతో కడుపు నిండా భోజనం చేస్తున్నారు. సోమవారం మొదలు కొని శనివారం వరకు రోజుకొక రకమైన బలమైన ఆహారాన్ని అందజేస్తున్నారు. భోజనంతో పాటు చెక్కి, రాగి జావను అందజేస్తూ విద్యార్థులకు పౌష్టికాహారం అందజేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో అమలు చేసిన మధ్యాహ్న భోజన పథకం, ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకాల్లో ఎన్నో మార్పులు తీసుకువచ్చారని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

ప్రస్తుతం జగనన్న గోరుముద్ద మెనూ ఇలా..

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రోజుకొక రకం ఆహారపదార్థాలను అందజేస్తున్నారు. ఆ మెనూను పరిశీలిస్తే...

సోమవారం	హట్ పొంగలి/కూరగాయల పలావ్ ఉడికించిన గుడ్డు/గుడ్డు కూర, వేరుశనగ చిక్కీ
మంగళవారం	పులిహోర, టమాటా పచ్చడి/దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడి గుడ్డు,
బుధవారం	కూరగాయల అన్నం, బంగాళ దుంప కూర్మా, ఉడికించిన కోడి గుడ్డు, చిక్కీ
గురువారం	సాంబార్ బాత్/లెమన్ రైస్ ఉడికించిన కోడి గుడ్డు, టమాటా చెట్నీ,
శుక్రవారం	అన్నం, ఆకు కూర పప్పు, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కీ
శనివారం	ఆకు కూర అన్నం, పప్పు చారు, తీపి పొంగలి.

వీటితో పాటు మంగళవారం, గురువారం, శనివారం ఉదయం తీపి రాగి జావ అందజేస్తారు.

భోజనం ఎంతో బాగుంది

మా పాఠశాలలో జగనన్న గోరుముద్ద భోజనం ఎంతో బాగుంది. ఇలాంటి భోజనం మా ఇంటి దగ్గర కూడా ఉండదు. రోజూ మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారు. ఎంతో ఇష్టంగా భోజనం చేస్తున్నాం.

–ఎ.ప్రశాంతి, 6వతరగతి

రుచికరంగా భోజనం పెడుతున్నారు:



మా పాఠశాలలో జగనన్న గోరుముద్దలో భోజనాలు రుచికరంగా పెడుదుతున్నారు. ఇంతకు మునుపు ఇన్ని రకాల ఆహారం ఉండేది కాదు. అప్పట్లో రుచిగా అనిపించేవి కాదు. ఇప్పుడు ఎంతో బాగున్నాయి.

–బి.చిన్ని, 9వతరగతి.

పిల్లలకు మంచి పోషకాహారం ఇస్తున్నారు



మా పాప టెక్కలి వంశధార కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. రోజూ పోషకాహారం అందజేస్తున్నారు. మధ్యాహ్నం భోజనం విషయంలో మాకు బెంగ తీరింది.

–డి.లక్ష్మి, విద్యార్థి తల్లి.



లింగాలవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు



పులిహోర, గుడ్డు, టమాటా చెట్నీ

ఆదిత్యుని సన్నిధిలో భక్తజనం



ఆదిత్యుని జ్ఞాపికను న్యాయమూర్తి శివకిరణ్‌కు అందజేస్తున్న కృష్ణమాచార్యులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని ఆదివారం సందర్భంగా భక్తులు భారీగా దర్శించుకున్నారు. స్థానిక జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా ప్రముఖులు, భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. తలనీలాల మొక్కులను కొందరు చెల్లించుకోగా, మరికొందరు భక్తులు ఆరోగ్యం కోసం సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. ఇక స్థానికవాసులకు విశిష్ట దర్శన క్యూలైన్ల నుంచి ఉచితంగా దర్శనాలకు పంపించడంతో స్థానికులంతా హర్షం వ్యక్తం చేశారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉచిత ప్రసాదాలను, మంచినీటిని అందుబాటులో ఉంచారు. అనకాపల్లి జిల్లా న్యాయమూర్తి శివకిరణ్ దంపతులు ఆదిత్యున్ని తొలిసారిగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ ఆలయ విశిష్టతను వివరించారు. కాగా వివిధ దర్శన టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.66,500, విరాళాల రూపంలో రూ.45,872, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.30 లక్షల ఆదాయం సమకూరినట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

'నేనెవరు' అని ప్రశ్నించుకోవాలి



వక్త ప్రసాదరావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ప్రతి ఒక్కరూ తనకు తానుగా నేనెరవరో ప్రశ్నించి తెలుసుకోవాలని వక్త రంగడు ప్రసాదరావు అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో రమణమహర్షి జయంతిని పురస్కరించుకొని నేనెవరు అనే అంశంపై ఆదివారం ప్రసంగం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతర శిష్యుడే గురువని రమణమహర్షి అనడానికి కారణమైన అంశాన్ని వివరించారు. రమణ మహర్షి అనుభవాలను విశదీకరించారు. ముందుగా వక్త ప్రసాదరావును మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఎస్.నారాయణమూర్తి, విశ్వేశ్వరరావు, మల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, చంద్రరావు, బాబూరావు, అరుణ, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.